సాక్షి
శ్రీకాకుళం
బుధవారం, 13 డిసెంబర్, 2023



విద్యా ప్రమాణాలపై సంతృప్తి

ఐటీడీఏ పీఓ కల్పనకుమారి గిరిజన ప్రాంతాల్లో పర్యటించారు. స్కూలు విద్యార్థులతో మాట్లాడారు. - 8లో



భారీగా పోలీసు బందోబస్తు

కాశీబుగ్గ: సీఎం పర్యటన సందర్భంగా పలాసలో పోలీసులు మోహరించారు. 10 మంది డీఎస్పీలు, 23 మంది సీఐలు, 56 మంది ఎస్‌ఐలు, 1490 మంది ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, పీసీలు, 40 మంది ఆర్మ్‌డ్ ఫోర్స్, 100 మంది హోంగార్డులు ఈ పర్యటనలో విధులు నిర్వహించనున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

కంచిలి: మకరాంపురం వద్ద నిర్మించిన ఉద్దానం ప్రాజెక్టు పంప్‌హౌస్, వాటర్ ట్యాంకులను సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను, భద్రతా అంశాలను ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ నవీన్‌లు మంగళవారం పరిశీలించారు. మొదట అంపురం వద్ద ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ నిర్మాణ పనుల్ని పరిశీలించారు. అనంతరం పంప్‌హౌస్, వాటర్ ట్యాంక్ వద్ద చేపడుతున్న పనుల్ని పరిశీలించారు.

పాతపట్నం నుదుట..

ప్రగతి సిందూరం



- 'పట్నం'లో శరవేగంగా అభివృద్ధి పనులు
- దశాబ్దాల సమస్యలకు పరిష్కారం
- నేడు పాతపట్నంలో సామాజిక సాధికార బస్సు యాత్ర

పర్వత శిఖరాలకు కొత్త దారులు పడుతున్నాయి. చందనగిరి అందుకు ఓ ఉదాహరణ. నదులపై వంతెనలు ఏర్పడ్డాయి. కాగువాడ దానికో నిదర్శనం. దశాబ్దాల తాగునీటి కష్టాలకు తెర పడుతోంది. కావాలంటే వైఎస్సార్ సుజలధారను చూసుకోవచ్చు. పంట భూములకు రెండు కాలాల్లో నీరిచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయి. చూడాలంటే గొట్టా బ్యారేజీ నుంచి వంశధార జలాశయం వరకు ఎంచక్కా టూర్ వేయవచ్చు. పాతపట్నం కొత్తగా మారుతోంది. అత్యల్ప తలసరి ఆదాయం ఉన్న ఈ నియోజకవర్గం తలరాత మార్చేలా ప్రభుత్వం ప్రాజెక్టులు మంజూరు చేస్తోంది. సంక్షేమాలతో నగటు జీవిని ఆదుకుంటూనే.. కొంగొత్త ప్రాజెక్టులతో ప్రగతి పునాదులను పటిష్టం చేస్తోంది. ఆ మంచిని వివరించేందుకు పాతపట్నంలో నేడు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర జరగనుంది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: అత్యంత తక్కువ తలసరి ఆదాయం ఉన్న పాతపట్నంను ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో చూస్తోంది. ఇక్కడ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తోంది. గత ప్రభుత్వాలన్నీ మాటలకే పరిమితం కావడంతో వైఎస్ జగన్ సర్కారు దశాబ్దాల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తోంది. ఇక్కడ నాలుగున్నరేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) కింద రూ. 1200కోట్లు అందించగా, నాన్ డీబీటీ కింద రూ. 826కోట్లకు పైగా లబ్ధి చేకూర్చారు.

ఈ నియోజకవర్గంలో గిరిజనజనాభా అధికం. రహదారులు లేని గ్రామాలెన్నో ఉన్నాయి. వాటికి ఇప్పుడిప్పుడే దారులు పడుతున్నాయి. కోట్లాది రూపాయల ఖర్చుతో గిరిజన గూడలకు పక్కా రహదారులు వేస్తున్నారు. కొండ దిగనిదే వారికి ఏదీ అందేది కాదు. ఇప్పుడు గిరిజన గూడలకే రేషన్ కూడా వెళ్తోంది. గత ప్రభుత్వం వంశధార నిర్వాసితులకు న్యాయం చేయకుండా మోసం చేయగా వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.216కోట్లకు పైగా అదనపు పరిహారం అందజేశారు. జిల్లాలో అత్యంత కీలకమైన ప్రాజెక్టులన్నీ ఇక్కడ నిర్మించారు.



అభివృద్ధి పథంలో పాతపట్నం సామాజిక ఆస్పత్రి



వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి (ఫైల్)



కాగువాడ-రొమదల మహేంద్రతనయ నదిపై వంతెన

అభివృద్ధి పనుల్లో కొన్ని..

- పాతపట్నంలో 246 పాఠశాలలను రూ.46.38 కోట్లతో బాగు చేశారు.
- మెళియాపుట్టి మండలంలోని చందనగిరి, హడ్డివాడ, కేరాసింగి, కేరాసింగిగూడ వంటి గిరిశిఖర గ్రామాలకు రహదారులు వేశారు.
- 27 గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా కాగువాడ-రొమదల గ్రామాలకు మహేంద్రతనయ నదిపై రూ.6.95 కోట్లు ఖర్చుతో వంతెన నిర్మించారు.
- పాతపట్నం సామాజిక ఆస్పత్రిని రూ.4.20 కోట్ల ఖర్చుతో ఆధునికీకరించారు.
- హిరమండలంలో రూ.700 కోట్లతో వైఎస్సార్ సుజలధార ప్రాజెక్టు ఏర్పాటు చేశారు.
- గొట్టా బ్యారేజీ వద్ద రూ.168 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మొదలుపెట్టారు.
- పాతపట్నంకు నీరిచ్చేందుకు రూ.265 కోట్లు మంజూరు చేశారు.
- వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారంగా రూ.216.72 కోట్లు ఇచ్చారు. కొత్తూరులోని మెట్టూరుకు ప్రభుత్వాస్పత్రి మంజూరు చేశారు.

పాతపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు..

పథకం	లబ్ధిదారులు	లబ్ధిపొందిన మొత్తం			
ఆసరా	35,960	రూ.91,84,83,688	కాపు నేస్తం	554	రూ.2,22,75,100
అమ్మఒడి	26,936	రూ.394,41,80,633	నేతన్న నేస్తం	207	రూ.1,49,04,000
చేదోడు	1,417	రూ.3,41,33,453	పింఛన్ కానుక	39,193	రూ.257,14,51,506
వైఎస్సార్ చేయూత	22,603	రూ.139,13,43,103	రైతు భరోసా	47,313	రూ.139,25,22,313
పంటల బీమా	14,366	రూ.343,10,38,157	సున్నావడ్డీ పంట రుణాలు	15,059	రూ.6,00,26,119
ఈబీసీ నేస్తం	276	రూ.1,05,14,064	వాహన మిత్ర	1,680	రూ.5,36,76,300
జగనన్న తోడు	3,924	రూ.1,02,58,657	వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	4,484	రూ.4,16,35,800
జగనన్న వసతి దీవెన	12,581	రూ.20,93,16,300	ఆరోగ్యశ్రీ	8,116	రూ.28,45,19,856
జగనన్న విద్యా దీవెన	17,229	రూ.47,85,38,521	వైఎస్సార్ బీమా	391	రూ.10,78,94,903
కళ్యాణమస్తు	220	రూ.3,10,89,683	సున్నా వడ్డీ (మహిళలు)	54,979	రూ.13,18,86,431



పలాసలో సిద్ధమవుతున్న సభాప్రాంగణం

చరిత్రలో నిలిచిపోయే పనులివి

- సీఎం శంకుస్థాపన చేసి.. ప్రారంభోత్సవం కూడా చేస్తున్నారు
- కిడ్నీ పరిశోధన కేంద్రం, వాటర్ గ్రిడ్ ప్రారంభానికి తరలిరండి
- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఉద్దానం చరిత్రలో నిలిచిపోయే రెండు గొప్ప పనులకు శంకుస్థాపన చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభానికి కూడా విచ్చేస్తున్నారని రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస రైల్వే క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి వద్ద ఆయన మంగళవారం నాయకులతో కలిసి మాట్లాడారు. పాదయాత్రలో ఉద్దానం కష్టాలు చూసిన జగనన్న చలించిపోయారని, అందుకే సీఎం అయిన వెంటనే కిడ్నీ ఆస్పత్రి, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారని చెప్పారు. రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, రూ.700 కోట్ల ఖర్చుతో వైఎస్సార్ సుజలధార పనులను పూర్తి చేశారని పేర్కొన్నారు. ఒకే టర్మ్‌లో శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించడం ఇంతవరకు జరిగి ఉండదని, కానీ నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగనన్న చేసి చూపించారని అన్నారు. రెండేళ్లు కోవిడ్‌తో పోయినా పూర్తి చేశారని గుర్తు చేశారు. ఈ పెద్ద ప్రాజెక్టులతో పాటు కొత్త పీహెచ్‌సీలు, కొత్తగా డిగ్రీ కాలేజీ, ఫ్లై ఓవర్ వంతెన పునర్నిర్మాణ పనులు వంటివి కూడా చేశారని గుర్తు చేశారు. తిత్లీ బాధితులకు అదనపు పరిహారం మంజూరు చేశామని, మత్స్యకారుల కోసం నువ్వలరేవులో జెట్టీ నిర్మించి హార్బర్‌గా మారుస్తున్నామని, మూలపేట పోర్టు పనులు జరుగుతున్నాయని వివరించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం భోగాపురంలో ఎయిర్‌పోర్టు నిర్మిస్తున్నారని, విశాఖను రాజధానిగా ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పానిల శ్రీనివాసరావు, ఎంపీపీ డొక్కరి దా నయ్య, హనుమంతు వెంకటరావుదొర, డబ్బీరు భవానీశంకర్, గుజ్జు జోగారావు, గౌరీ త్యాడి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, అంధవరపు సూరిబాబు, పేరాడ తిలక్

'సీఎం పర్యటన విజయవంతం చేయండి'

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 14న జిల్లాకు వస్తున్నారని, పర్యటనను విజయవంతం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మకరాంపురంలో డాక్టర్ వైఎస్సార్ సుజలధార ఉద్దానం మంచినీటి ప్రాజెక్టును, పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అలాగే 60 ఎకరాల్లో నిర్మించనున్న ఇండస్ట్రియల్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే పాతపట్నంలో బుధవారం నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

మంత్రి ధర్మానను కలిసిన ఈఓ



ధర్మానను కలిసిన ఆలయ ఈఓ మాధవి

శ్రీకాకుళం రూరల్: స్థానిక కొన్నావీధి భీమేశ్వర స్వామి దేవాలయం నూతన ఈఓ పొన్నంగి మాధవి మంగళవారం మంత్రి ధర్మాన ప్రసాద రావును మర్యాదపూర్వకంగా కలిశారు. పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలవగా.. ఆలయ నిర్మాణం సజావుగా జరిగేలా భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయన కోరారు. ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, నగరంలోని అతి ప్రాచీన ఆలయంగా గుర్తింపు ఉందని ఈ సందర్భంగా ఆమెకు మంత్రి వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండవల్లి రవి తదితరులు ఉన్నారు.

'జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలి'



జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్టు సభ్యులకు ట్రోఫీని అందజేస్తున్న సూర శ్రీను

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రపోటీల్లో కనబర్చిన పోరాట ప్రతిభతో జాతీయస్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లోనూ విజయ బావుటా ఎగురవేయాలని బాల్ బ్యాడ్మింటన్ సమాఖ్య ఎచ్చెర్ల క్లబ్ అధ్యక్షుడు సూర శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తాజాగా అనంతపురం జిల్లా వేదికగా జరిగిన 9వ ఏపీ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచి పతకాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా క్రీడాకారుల బృందాన్ని ఆయన అభినందించారు. జిల్లా క్రీడాకారులకు అన్నివిధాలా సహాయసహకారాలను అందిస్తామని అన్నారు. జాతీయ, సౌత్‌జోన్ నేషనల్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ముంత గాయత్రి, సింగూరు నందిని, పి.చిరంజీవిలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో శిక్షకుడు యానాల తారకేశ్వరరావు, ఎం.మధుసూధనరావు, శ్రీకాకుళం మండలం బాల్ బ్యాడ్మింటన్ ప్రధానకార్యదర్శి గొండు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

• దేదీప్యమానం



గెద్దకంచరాం మంగళవారం రాత్రి దేదీప్యమానంగా వెలిగిపోయింది. గ్రామంలోని శివ, అయ్యప్ప స్వాములు, స్థానికులు కార్తీక మాసం ఆఖరి రోజున దీపారాధన చేశారు. క్రతువును తిలకించేందుకు వందలాది మంది హాజరయ్యారు.

\- జి.సిగడాం

• వైభవంగా నదీ హారతి



శ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా వద్ద గల కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం సాయంత్రం స్వామికి నాగావళి నది వద్ద నదీ మాతృకా హారతులు ఇచ్చారు. ఆలయ అర్చకులు బూరాడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి నది ఒడ్డున 16 హారతులు, 26,699 ఒత్తులతో అఖండ హారతితో కూడిన స్వస్తి కార్యక్రమం నిర్వహించారు.

\- శ్రీకాకుళం కల్చరల్

నేడు డీఎల్‌టీసీలో మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ : నగరంలోని బలగ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ ఐటీఐ శిక్షణ కేంద్రంలో బుధవారం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. నిర్మాణ్ సంస్థ విశాఖపట్నం వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్, ఎంఎస్‌ఎన్ ల్యాబ్స్, పేటీఎం, హీరో మోటోకార్ప్, డైకన్ తదితర కంపెనీల్లో 695 ఖాళీలకుగాను అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేస్తామన్నారు. టెన్త్‌క్లాస్ నుంచి పీజీ వరకు, డిప్లమా, ఐటీఐ, ఇంజనీరింగ్, తదితర విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే జాబ్‌మేళాకు హాజరుకావాలని సుధ కోరారు. వివరాలకు ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌పోర్టల్‌ను సంప్రదించాలన్నారు.

గవర్నర్‌తో..



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతిలోని రాజ్‌భవన్‌లో కలిసి వర్సిటీలో ఉన్నత విద్య అమలు చేస్తున్న విధానాన్ని గవర్నర్‌కు వివరించినట్లు వీసీ చెప్పారు. వికసిత్ భారత్ -2047 కార్యక్రమం, నూతన విద్యావిధానం -2020 అమలు వంటి వాటిపై చర్చించినట్లు తెలిపారు.



గవర్నర్‌ను సత్కరిస్తున్న రాజేష్

గవర్నర్‌ను కలిసిన రాజేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'వికసిత్ భారత్ జీ 2047' కార్యక్రమాన్ని ఏపీ ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో అమరావతిలోని రాజ్‌భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్, జేఎన్‌టీయూ పాలక మండలి సభ్యుడు డాక్టర్ బుడుమూరు రాజేష్ ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాద పూర్వకంగా రాజేష్ కలిసి దుశ్శాలువతో సత్కరించారు.

23న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి, పార్టీ అనుబంధ సంఘాల ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో ఈ నెల 23న జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు జీవీవీ గణేష్ నాయుడు, జోనల్ ఇన్‌చార్జి గేదెల వాసుదేవరావులు కోరారు. శ్రీకాకుళం నగరంలో చంద్రమహల్ ఎదురుగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గల పార్టీ లీగల్‌సెల్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, జిల్లాబార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు, పొన్నాడ వెంకటరమణ, తంగి శివప్రసాద్, వినయభూషణ్, టంకాల బాలకృష్ణ, బలగ గణపతిపట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నైజీరియాలో కొమరల్తాడ వాసి మృతి



తిరుపతిరావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం కొమరల్తాడ గ్రామానికి చెందిన బత్సల తిరుపతిరావు(48) నైజీరియాలో అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు గత 20 ఏళ్లగా నైజీరియాలో పనిచేస్తూ.. కొన్ని నెలల క్రితం స్వగ్రామం వచ్చాడు. తిరిగి 9 నెలల కిందట నైజీరియా వెళ్లి అనారోగ్యానికి గురైనట్లు కంపెనీ యాజమాన్యం కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. సోమవారం రాత్రి మృతి చెందినట్లు సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతునికి భార్య సరోజిని, కుమారుడు సందీప్, కుమారుడు కావ్య ఉన్నారు. తిరుపతిరావు మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, మంత్రి సీదిరి అప్పలరాజు సహకరించాలని సర్పంచ్ చింత రాజు, కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

చకచకా హెలీప్యాడ్ నిర్మాణం



కాశీబుగ్గ: పలాసలో గురువారం సీఎం వైఎస్ జగన్ పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో హెలీ ప్యాడ్‌ను నిర్మించారు. ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు తొలుత అనుకున్న స్థలం కాకుండా కాస్త ముందుకు హెలీప్యాడ్ మార్చి నిర్మాణ పనులు పూర్తి చేశారు.

రైతు సేవలకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు



కొరసాంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం.

ఆమదాలవలస రూరల్: రైతులందరికీ మద్దతు ధర అందించాలనే ఉద్దేశంతో అన్నదాతలకు అందుబాటులో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కొరసాం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో పంటల విక్రయానికి రైతులు ఇబ్బందులు పడేవారని, వైఎస్సార్ సీపీ వచ్చాక ఆ అవస్థలు తొలిగాయన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొంటుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, పీఏసీఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ సీఈఓ రమణ, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలపై పీఓ సంతృప్తి



కొత్తూరు మండలం పొలంగూడ గిరిజన గ్రామంలో గిరిజన సమస్యలను తెలుసుకుంటున్న ఐటీడీఏ పీఓ కల్పన కుమారి

కొత్తూరు: కొండూరుగూడ గిరిజన గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలో విద్యా ప్రమాణాలపై సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనకుమారి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మండలంలోని పెద్దగూడ, పొలంగూడలతో పాటు పలు గిరిజన గ్రామాలను మంగళవారం సందర్శించారు. జీపీఎస్ పాఠశాలలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం గిరిజన గ్రామాల్లో వన్ ధన వికాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, తాగునీరు, రహదారుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

పోలీసు లాంఛనాలతో జవాన్‌కు అంత్యక్రియలు



బీఎస్‌ఎఫ్, పోలీసు లాంఛనాల మధ్య అంత్యక్రియలు జరుగుతున్న దృశ్యం

కోటబొమ్మాళి: కొత్తపల్లికి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ దుబ్బ రామారావు ఆదివారం గుజరాత్‌లో అనారోగ్యంతో మరణించగా సోమవారం రాత్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తెచ్చారు. బీఎస్‌ఎఫ్, పోలీసు లాంఛనాల మధ్య మంగళవారం ఉదయం అంత్యక్రియలు పూర్తి చేశారు. గుజరాత్ నుంచి వచ్చిన పదిమంది బీఎస్‌ఎఫ్ దళ సభ్యులు, కోటబొమ్మాళి ఎస్ఐ మహమ్మద్ అలీ, పోలీసులు రామారావు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు.

'సమస్యలు పరిష్కరించాలని డిమాండ్'

శ్రీకాకుళం న్యూకాలనీ: తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతామని సమగ్రశిక్ష ప్రాజెక్ట్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా సీఆర్‌ఎంటీ యూనియన్ అధ్యక్షుడు పీటీ నాయుడు, ప్రధాన కార్యదర్శి బి.గిరిధర్, ఎంఐఎస్ యూనియన్ అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్‌ల నేతృత్వంలో ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్‌ను కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని అన్ని మండలాల్లో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన జీతాల బకాయిలు, ఉద్యోగ భద్రత వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఏపీసీని కలిసినవారిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ యూనియన్ అధ్యక్షులు రాము, ఉషారాణి ఐఆర్‌టీ నాయకులు భాను ప్రకాష్, అకౌంటెంట్ యూనియన్ నాయకులు శివ మరియు మెసెంజర్ యూనియన్ నాయకులు పోతయ్య మరియు సిఆర్ఎంటి యూనియన్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు రామకృష్ణ, శ్రీనివాసరావు, యుగంధర్, నర్సింగరావు, వైకుంఠరావు ఉన్నారు.

అధ్వానంపేట విద్యార్థులకు అరుదైన గౌరవం



ప్రశంసా పత్రాలు, బహుమతులతో అధ్వానంపేట విద్యార్థులు

జి.సిగడాం: గుంటూరు వీవీఐటీలో ప్రపంచ తెలుగు బాలల పండగ బాలోత్సవ్ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో జి.సిగడాం మండలం అధ్వానంపేట ఎంపీపీ పాఠశాలకు చెందిన విద్యార్థులకు అరుదైన గౌరవం దక్కింది. ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ కూర్మాన అరుణకుమారి ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శించిన 'ప్లాస్టిక్‌భూతం' అనే నాటికకు రాష్ట్రస్థాయిలో నాల్గో బహుమతి దక్కింది. దీంతో వీరికి వీవీఐటీ వైస్ చైర్మన్ ప్రత్యూష పతకాలు, బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం, విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారులు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, స్థానికులు అభినందించారు.

ఆకట్టుకున్న రంగవల్లికలు



టెక్కలి: లింగ వివక్షకు వ్యతిరేకంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులు వేసిన రంగవల్లికలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ నేతృత్వంలో ర్యాలీ నిర్వహించి అనంతరం విద్యార్థినులతో రంగ వల్లికలు వేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్, అధ్యాపకులు లీలాపద్మజ, కవిత, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులు వేసిన రంగవల్లికలు


వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగంలో జిల్లావాసులు



కూన రమణమ్మ



లంకలపల్లి గోపి



నక్క రామరాజు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా లావేరుకు చెందిన లంకలపల్లి గోపి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీకాకుళం నగరానికి చెందిన నక్క రామరాజులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు.

మహిళా విభాగం సంయుక్త కార్యదర్శిగా..

వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళావిభాగం సంయుక్త కార్యదర్శిగా పొందూరుకు చెందిన కూన రమణమ్మను నియమించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

ఉద్దానంపై పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడరు


• రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు



కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో ఉన్న కిడ్నీవ్యాధి బాధితుల కోసం ఏ నాయకుడూ ఏమీ చేయలేదని, సీఎం వైఎస్ జగన్ మాత్రమే పరిష్కార మార్గం చూపించారని రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. పలాసలో ముఖ్యమంత్రి పర్యటనలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. సభాస్థలి వద్ద విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదని, అయినా పవన్ కల్యాణ్ దానిపై మాట్లాడడం లేదన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉద్దాన ప్రాంతానికి రూ.700 కోట్లతో వాటర్ గ్రిడ్, రూ.50 కోట్లతో కిడ్నీ పరిశోధన కేంద్రం, రూ.కోట్లలో తిత్లీ పరిహారం, పోర్టు, ఫిషింగ్ హర్బర్ వంటి చేస్తుంటే ఈ అభివృద్ధినైనా ప్రస్తావించడం లేదన్నారు.

మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జిల్లా సీనియర్ నాయకులతో సమన్వయం చేసుకుంటూ పలాసకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. పలాసలో జరిగిన అభివృద్ధిని ప్రజలంతా గుర్తిస్తారని అన్నారు. పలాసలో ఉన్న వైశ్యులు, వ్యాపారులు, వర్తక సంఘాల వారితో ప్రత్యేకంగా సమావేశమై సీఎం కార్యక్రమానికి ఆహ్వానించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ మినహాయింపు ఇవ్వాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు

శ్రీకాకుళం: ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ నుంచి మినహాయింపు చేసి సంస్థలో పరిమితి లేని వైద్యాన్ని కొనసాగించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 1,2 డిపోల ఉద్యోగులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ 95, సీపీఎస్‌పై ఆప్షన్ నిలుపుదల చేసి ఉద్యోగి ఎప్పుడైనా ఆప్షన్ ఇచ్చుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శులు ఎస్.సిమ్మయ్య, జి.కామేశ్వరరావు, కేవీఆర్ కుమార్, 1,2 డిపో ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు.

రైల్వే గేటు వద్ద బీటీ రోడ్డు నిర్మాణం

పాతపట్నం: పాతపట్నం రైల్వే స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే గేటు పక్కన కొత్త గేటు ఇటీవల ఏర్పాటు చేశారు. కొత్త గేటు వద్ద బీటీ రోడ్డు నిర్మాణం మంగళవారం చేపట్టారు. పాత గేటును మంగళవారం సాయంత్రం మూసివేశారు. కొత్త గేటు వద్ద సిగ్నల్ లైట్‌ను కూడా ఏర్పాటు చేశారు. రైలు బండి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు రైల్వే సిగ్నల్ లైట్ వెలుగుతుందని రైల్వే అధికారులు తెలిపారు.